సాక్షి
జగిత్యాల
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



బతుకమ్మకు పట్టుకుచ్చుల అందం

బతుకమ్మకు అందం తెచ్చే పట్టుకుచ్చులు(కాక్స్‌కాంబ్) పూల సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది.

8లో▸



డిజిటల్ క్రాప్ సర్వే షురూ

డిజిటల్ క్రాప్ సర్వే' క్రమంగా పట్టాలెక్కుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం సర్వే చేపడుతున్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో చాలాచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతి సమైక్యతతో ముందుకు సాగాలి



చిత్రపటాలకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: జాతి సమైక్యతతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంతో మంది సమరయోధుల పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు, సీఐలు ఆరీఫ్‌అలీఖాన్, అనిల్‌కుమార్, రాంనరిసింహారెడ్డి, సుధాకర్, కరుణాకర్, ఆర్‌ఐలు కిరణ్‌కుమార్‌రెడ్డి, సైదులు, వేణు, ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. రాచరిక పాలన



మాట్లాడుతున్న వసంత

జగిత్యాల: రాష్ట్రంలో ప్రజాపాలన కాదు.. రాచరిక పాలన నడుస్తోందని జెడ్పీ మాజీ చైర్పర్సన్ వసంత అన్నారు. బుధవారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి రైతాంగ సాయుధ పోరాటం ఉదాహరణ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సుపరిపాలన అందిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రజావ్యతిరేక పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌రావు, గంగాధర్, మల్లేశ్, వొల్లం మల్లేశం, దేవేందర్‌నాయక్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ముగిసిన విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలు



శోభాయాత్రలో విశ్వకర్మలు

ధర్మపురి: పట్టణంలోని గోదావరి ఒడునున్న విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఐదు రోజులపాటు నిర్వహించారు. జయంతి వేడుకల సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారి సేవా పల్లకిని పట్టణ పురవీధుల మీదుగా ఊరేగించారు.

తాగునీటి కోసం గ్రామస్తుల ధర్నా



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న వీరాపూర్ గ్రామస్తులు

రాయికల్: పదిహేను రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం మండలంలోని వీరాపూర్ గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పైప్‌లైన్ లీక్ కావడంతో నల్లా నీరు రావడం లేదని, పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని, ఉన్న బోరు కూడా వినియోగంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు అందిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మనుషుల అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత



టీచర్స్ భవన్‌లో మాట్లాడుతున్న చంద్రయ్య

జగిత్యాల: మనుషుల అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ప్రజ్వల ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్రయ్య అన్నారు. బుధవారం టీచర్స్ భవన్‌లో విద్య పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ చట్టాల గురించి వివరించాలని, పోక్సో, ఐటీపీఏ, బీఎన్‌ఎస్ చట్టాలపై విద్యార్థులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, చంద్రయ్య, సరిత, రాజేశ్, మహేశ్, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలనలో పేదలకు భరోసా

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- సన్నవడ్లకు బోనస్ ఇస్తున్నాం
- భూభారతితో సమస్యలు పరిష్కారం
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



జాతీయ పతకానికి సెల్యూట్ చేస్తున్న నిరంజన్



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

జగిత్యాల: ప్రజాపాలనలో పేదలకు భరోసా లభిస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, సన్నవడ్లకు బోనస్, విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. భూభారతి చట్టం ద్వారా రైతులకు వెసులుబాటు కలుగుతుందన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో మాట్లాడారు. 1948లో తెలంగాణ నిజాంచెర నుంచి విముక్తి పొంది దేశంలో విలీనమైన రోజు సెప్టెంబర్ 17 అన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

ఇంటి స్థలం ఉండి.. దరఖాస్తు చేసుకున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న 10,775 మందికి ఇళ్లు ఇవ్వగా 7,245 ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని, లబ్ధిదారులకు దశలవారీగా రూ.29.19 కోట్లు చెల్లించామని వివరించారు. భూభారతి ద్వారా రెవెన్యూ సదస్సులు నిర్వహించి 25,672 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించామని, సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. 2024–25 యాసంగి సీజన్‌లో 428 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 4,63,308 టన్నుల దొడ్డురకాన్ని 86,979 మంది రైతుల నుంచి కొని రూ.1,075 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. 30,626 టన్నుల సన్నరకం ధాన్యాన్ని 940 మంది రైతుల నుంచి కొని రూ.11కోట్లతోపాటు, క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 38,619 మందికి రేషన్ కార్డులు మంజూరు చేశామని, 75,052 మంది కుటుంబ సభ్యుల పేర్లు కొత్తగా చేర్చామని వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024 నుంచి విద్యార్థులకు 200 శాతం డైట్ చార్జీలు 40 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామన్నారు. 1,67,154 జాబ్‌కార్డులు జారీ చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 11.12 లక్షల పనిదినాలు కల్పించి 32.19 లక్షల ఉపాధి కూలీలకు పనులు కల్పించామన్నారు.

మహిళలకు రుణాలు

మహిళలందరినీ కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా 461 వ్యక్తిగత యూనిట్లకు రూ.10.21కోట్లు మంజూరు చేశామన్నారు. 53 గ్రూపులకు రూ.9.14 కోట్లు కేటాయించామన్నారు. 330 స్వశక్తి సంఘాలకు ఈ ఏడాది రూ.45.54 కోట్లు బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేశామన్నారు. ముందుగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆయనకు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ స్వాగతం పలికారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు బీఎస్.లత, రాజాగౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిని దర్శించుకున్న నిరంజన్

అనంతరం నిరంజన్ నూకపల్లిలోని సరస్వతి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతులకు భరోసా

వానాకాలం సీజన్‌లో రైతులకు రైతుభరోసా అందించామని, 2,25,406 మంది రైతులకు రూ.243.32 కోట్లు జమచేశామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. నాలుగు విడతల్లో 80,515 మంది రైతులకు రూ.721.74 కోట్ల మాఫీ చేశామన్నారు. రైతుబీమా ద్వారా రూ.248.80 కోట్లు అందించి ఆర్థిక చేయూత కల్పించామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా 19,661 మందికి రూ.46.21 కోట్ల విలువ చేసే శస్త్రచికిత్స చేయించామన్నారు.

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి

జగిత్యాలటౌన్: శిల్పకల,వాస్తు శిల్పి మూలపురుషుడు విశ్వకర్మ అని నిరంజన్ అన్నారు. కలెక్టరేట్లో విశ్వకర్మ జయంతి వేడుకలో పాల్గొన్నారు. ఆధునిక సమాజంలో ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు విశ్వకర్మను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ రాజా గౌడ్, బీసీ సంక్షేమ అధికారి సునీత, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మీ పథకం ద్వారా..

మహాలక్ష్మీ పథకాన్ని ఇప్పటి వరకు 5.41 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని, వారికి రూ.279.93 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. రూ.500కే సిలిండర్ సరఫరా చేస్తున్నామని, రూ.23.73 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరించిందన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకున్న వారికి జీరో బిల్లు ఇస్తున్నామని, 2,07,474 సర్వీసులకు రూ.125.62కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు.

గోదావరి పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేయండి



పుష్కర ఘాట్‌లను పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, కలెక్టర్ సత్యప్రసాద్

- ధర్మపురిలో మాస్టర్‌ప్లాన్ అమలుకు రూపకల్పన
- మంత్రి అడ్లూరి, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్
- నృసింహస్వామి ఆలయ పునఃనిర్మాణంపై సమీక్ష

ధర్మపురి: వచ్చే గోదావరి పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి నివేదిక అందించాలని రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. 2027లో నిర్వహించే పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున సరిపడా వసతులు కల్పించాలని, శాశ్వత ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గోదావరి తీరం వెంట ఉన్న ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఇందుకోసం మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఆలయ పునఃనిర్మాణంపై సమగ్రంగా చర్చించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆగమశాస్త్రం ప్రకారం పనులు ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం స్వామివారి బ్రహ్మపుష్కరిణి, ఆలయ పరిసరాలు, కోటిలింగాల పుష్కరఘాట్లను పరిశీలించారు. వా రివెంట అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, దేవా దాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ, ఆలయ ఈవో శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఉన్నారు. ముందుగా శైలజరామయ్యర్, మంత్రి అడ్లూరి, కలెక్టర్ సత్యప్రసాద్ వేర్వేరుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

కోటిలింగాల పుష్కరఘాట్ల పరిశీలన

వెల్గటూర్: పుష్కరస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రానీయొద్దని మంత్రి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజారామయ్యర్ అన్నారు. రోడ్ల నిర్మాణం, పార్కింగ్, తాగునీరు, స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునే గదులు, టాయిలెట్ సదుపాయాలపై పర్యవేక్షించారు. బాసర మొదలు ధర్మపురి, కోటిలింగాల, కాళేశ్వరం, మంథని వరకు గోదావరి తీరాన్ని ఆనుకొని ఉన్న ప్రతి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం కోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్, ఏఎంసీ చైర్మన్ గోపిక, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పక్షం రోజులపాటు నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కార్యక్రమం నిర్వహిస్తారని, వైద్యులు మంచి చికిత్స అందిస్తారని తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. మహిళలకు వచ్చే వివిధ రకాల హైపర్‌టెన్షన్, డయాబెటిస్, సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్‌క్యాన్సర్, అనేమియా వంటి వాటిని గుర్తించి చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షించుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, మాతాశిశు సంక్షేమ కేంద్రం సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డీడబ్ల్యూవో నరేశ్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో అగ్రగామిగా దేశం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు



పెగడపల్లిలో రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: ప్రధాని మోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జెండా విష్కరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు. అనంతరం కాటం నర్సింహరెడ్డి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ధర్మపురి ఇన్‌చార్జి అంజయ్య, జిల్లా అధికార ప్రతినిధి సత్యం, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, మహేశ్, హరీశ్, రవీందర్‌రెడ్డి, కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రాష్ట్రం విలీనంలో నెహ్రూ, పటేల్ పాత్ర

- మాజీమంత్రి జీవన్‌రెడ్డి



ఇందిరాభవన్‌లో జెండా ఎగురవేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: హైదరాబాద్ రాష్ట్రం దేశంలో విలీనం కావడం వెనుక నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర పోషించారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఇందిరాభవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. భారత సైన్యాన్ని హైదరాబాద్ కు తరలించి రాచరిక పాలన నుంచి విముక్తి కల్పించారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడం మంచి నిర్ణయమన్నారు. నాయకులు బండ శంకర్, గాజుల రాజేందర్, రాంచంద్రారెడ్డి పాల్గొనారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

జగిత్యాలటౌన్: సీపీఐ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విజయాలు నేటి పరిస్థితిపై సదస్సు నిర్వహించారు. సాయుధ పోరాట అమరులకు నివాళి అర్పించారు. ఎర్రజెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. తుల రాజేందర్, వెంకటస్వామి, భూమేశ్వర్, సుతారి రాములు, మునుగూరి హన్మంతు, కొక్కుల శాంత, లక్ష్మి పాల్గొన్నారు.

బెడ్లు లేక రోగులు విలవిల

- పేరుకే 50.. ఉన్నది కొన్నే..
- ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స
- ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రి పరిస్థితి



ధర్మపురి ఆస్పత్రిలో ఒకే బెడ్డుపై ఇద్దరికి వైద్యం

ధర్మపురి: వివిధ సమస్యలతో బాధపడుతు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న రోగులకు సరిపడా బెడ్లు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రి గతంలో 30పడకలుగా ఉండేది. వైద్య విధాన పరిషత్‌లోకి మారడంతో 50 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. కానీ.. ఇది పేరుకు మాత్రమే. కేవలం పది బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విషజ్వరాలతో చాలామంది బాధపడుతున్నారు. బుధవారం 184 మంది ఓపీ వచ్చారు. వీరిలో వివిధ వ్యాధులో బాధపడుతున్నవారిని ఆస్పత్రిలో చేర్చుకున్నారు. అయితే ఒక్కో బెడుపై ఇద్దరు చొప్పున ఉంచి వైద్య సేవలందించారు. రోగి వెంట వచ్చి సహాయకులు ఆస్పత్రిలో స్థలం లేక బయట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆస్పత్రిని సందర్శించి రోగులకు సరిపడా వసతులు కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. అయినప్పటికీ అదనపు వసతులు కల్పించలేదనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తే.. బెడ్లు లేకుండాపోయాయని రోగులు ఆవేదనం వ్యక్తం చేశారు. ఈ విషయమై వైద్యాధికారి రవిని వివరణ కోరగా ప్రస్తుతం ఆస్పత్రి పైఅంతస్తు పనులు పూర్తికాకపోవడంతో బెడ్లు ఉపయోగించడం లేదన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఎనిమిది బెడ్లు జనరల్ వార్డులో, మూడు ఎమర్జెన్సీ, 15 పోస్ట్ ఆపరేటర్ వార్డులో, 10 ఐసీయూలో ఉన్నాయని, పరిస్థితులను బట్టి వినియోగించుకుంటున్నామని తెలిపారు.

ప్రజాపోరుతోనే తెలంగాణకు విముక్తి



మాట్లాడుతున్న లెల్లెల బాలకృష్ణ

జగిత్యాలటౌన్: సబ్బండ వర్గాల పోరాటంతోనే నిజాం నిరంకుశత్వం నుంచి తెలంగాణకు విముక్తి లభించిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ‘వీర తెలంగాణ విప్లవ పోరాటం – నేటి వక్రీకరణలు’ అంశంపై సదస్సు నిర్వహించారు. రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది కమ్యునిస్టులు, వేలాది మంది ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఆ పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ స్థానం ఏమిటని ప్రశ్నించారు. ఏ మాత్రం సంబంధం లేని పార్టీలు విమోచన, విలీనం, విద్రోహం అంటూ చరిత్రకు వక్రభాష్యాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కోమటి చంద్రశేఖర్, ఎంఏ.చౌదరి, మల్యాల సురేష్, లకావత్ మహిపాల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో బయోవ్యర్థాలు

- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పట్టించుకోని అధికారులు



ఓ వీధిలో బహిరంగ ప్రదేశంలో పడేసిన బయో వ్యర్థాలు

మెట్‌పల్లి: పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ల నుంచి వెలువడే బయో వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీటిని ప్రభుత్వం గుర్తించిన బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ చాలామంది నిర్మానుష్య ప్రదేశాల్లో పడేసి చేతులు దులుపుకుంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇవి నిబంధనలు..

- ఆస్పత్రులు, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ల్లో వినియోగించిన సిరంజీలు, సూదులు, మాస్కులు, చేతి గ్లౌజులు, సెలైన్ బాటిళ్లు, గాయాలకు డ్రెస్సింగ్ చేసిన దూది, తొలగించిన అవయవాలు తదితర వాటిని బయో వ్యర్థాలుగా పరిగణిస్తారు.
- వీటిని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా ఉండడానికి కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు అప్పగించాల్సి ఉంటుంది.
- ఇందుకు ఆ సంస్థకు ఆస్పత్రుల స్థాయిని బట్టి ఫీజును చెల్లించాల్సి ఉంటుంది.
- ఫీజు చెల్లించే ఆసుపత్రుల నుంచి సదరు సంస్థ వాహనాల ద్వారా వ్యర్థాలను సేకరిస్తుంది. అ తర్వాత వాటిని కాల్చి భూమిలో పాతి పెడుతుంది. ఈ ప్రక్రియ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగే అవకాశముండదు.

జరుగుతోందిలా..

- పట్టణంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు చాలా వరకు వ్యర్థాలను బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థకే అందిస్తుండగా.. ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు.
- వ్యర్థాలను మున్సిపల్ ఆటోల్లో గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ పడేస్తున్నారు.
- ఆటోల్లో వేసే వ్యర్థాలు శివారులో ఉన్న డంపింగ్ యార్డుకు చేరుతాయి.

పొంచి ఉన్న ముప్పు..

- బహిరంగ ప్రదేశాల్లో ఈ వ్యర్థాలను వేయడం ద్వారా పలు రకాల వైరస్‌లు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశముంటుంది.
- దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా కాలుష్య నియంత్రణ మండలి, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- అయితే ఈ రెండు శాఖల అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో బయో వ్యర్థాలను విచ్చలవిడిగా పడేస్తున్నారు.
- ఆయా శాఖల అధికారులు స్పందించి బయో వ్యర్థాలపై నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ 37 గేట్ల ఎత్తివేత



దిగువకు విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భా రీగా వరద వస్తుండటంతో 37గేట్లు ఎత్తి 2,32,128 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి 2.15 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ వద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య



రాహుల్ (ఫైల్)

జగిత్యాలక్రైం: బీటెక్ చదువు మధ్యలో మానేసి ఇంటి వద్ద ఖాళీగా ఉంటూ.. సెల్‌ఫోన్ చూస్తుండటంతో తండ్రి మందలించగా మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాలలో చోటుచేసుకుంది. జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఈగ రాహుల్ (25) బీటెక్ మధ్యలో మానేశాడు. ఇంట్లో ఖాళీగా ఉంటూ ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తున్నాడు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడొద్దని తండ్రి మందలించాడు. మనస్తాపానికి గురైన రాహుల్ ఇంట్లో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రవికిరణ్ తెలిపారు.

కరెంట్ బిల్లు చెల్లించమన్నందుకు.. యువకుడి ఆత్మహత్యాయత్నం



స్తంభంపైకి ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన లక్ష్మణ్

ధర్మపురి: విద్యుత్ బిల్లు చెల్లించాలని సిబ్బంది డిమాండ్ చేయడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువుల కథనం ప్రకారం.. ధర్మపురికి చెందిన బండారి లక్ష్మణ్ జీవనోపాధి కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు సర్వీస్‌సెంటర్ పెట్టుకున్నాడు. కరెంట్ బిల్లులో సగం నాలుగు రోజుల క్రితం చెల్లించాడు. మిగిలిన మొత్తం చెల్లించాలని విద్యుత్ సిబ్బంది బుధవారం ఇంటివద్దకు వెళ్లి గొడవ చేశారు. దీనికి మనస్తాపానికి గురైన లక్ష్మణ్ ఇంటిపక్కనున్న విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లను పట్టుకునేందుకు యత్నించాడు. అదే సమయంలో కరెంట్ పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. బంధువులు, స్నేహితుల చొరవతో కిందికి దిగి విద్యుత్ సిబ్బందితో మాట్లాడించారు.

లారీ ఢీకొని కార్మికురాలి మృతి

పెద్దపల్లిరూరల్: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోదాం ఆవరణలో బుధవారం లారీ ఢీకొన్న ఘటనలో అఫ్జల్‌బేగం (58) అనే కార్మికురాలు అక్కడికక్కడే మరణించింది. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో నివాసముంటున్న అఫ్జల్‌బేగం.. ఎప్పటిలాగే గోదాంలో పనికి వెళ్లింది. పనిచేస్తున్న సమయంలో కార్మికురాలిని చూడకుండా డ్రైవర్ లారీని అజాగ్రత్తగా వెనక్కి తీసుకురావడంతో ఢీ కొందని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలి కూతురు పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బతుకమ్మకు పట్టుకుచ్చుల అందం

- పెద్దాపూర్‌లో పెరిగిన సాగు విస్తీర్ణం
- రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలని వినతి

జూలపల్లి(పెద్దపల్లి): బతుకమ్మకు అందం తెచ్చే పట్టుకుచ్చులు(కాక్స్‌కాంబ్) పూల సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది. ఆడపడచులు సంబురంగా ఆడుకునే బతుకమ్మ వేడుకల్లో బతుకమ్మను పేర్చేందుకు పట్టుకుచ్చులు వినియోగిస్తారు. వీటిని పెద్దాపూర్, తెలుకుంట, నాగులపల్లె, జూలపల్లి, చీమలపేట తదితర గ్రామాల్లో రైతులు విరివిగా సాగు చేస్తున్నారు. మూడు నెలలకే పంట కోతకు వస్తుంది. పెట్టుబడి తక్కువ, శ్రమతో కూడుకున్నది. అయినా, డిమాండ్ అధికంగా ఉండడంతో అన్నదాతలు వీటి సాగుకు మొగ్గుచూపుతున్నారు. బతుకమ్మ పండుగకు మూడు నెల ముందే నారుపోస్తారు. సస్యరక్షణ చర్యలతో నాణ్యమైన పూలు పండిస్తున్నారు. గతంలో రెండు, మూడు ఎకరాలకే పరిమితమైన పట్టుకుచ్చుల సాగు.. ఇప్పుడు సుమారు 15 ఎకరాలకు పైగా పెరిగిందని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. అయితే, ప్రభుత్వం నుంచి



ప్రోత్సాహం ఉంటే సాగు విస్తీర్ణం మరింత పెంచుతామని రైతులు చెబుతున్నారు.

పల్లెల నుంచి పట్టణాలకు..

వివిధ పల్లెల్లో పండిస్తున్న పట్టుకుచ్చుల పూలను రైతులు పట్టణాలకు తరలిస్తున్నారు. ప్రధానంగా మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్, హైదరాబాద్, సిద్దిపేట తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

ప్రోత్సాహం ఇవ్వాలి



పట్టుకుచ్చుల పూల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. బంతిపూల సాగుకు అందించినట్లు మాకూ సహకారం అందించాలి.

– పెసరు లచ్చయ్య, రైతు, పెద్దాపూర్

వన్నె తెస్తాయి



బతుకమ్మ తయారీలో పట్టుకుచ్చులు అగ్రస్థానంలో ఉంటాయి. ఈ పూలు బతుకమ్మ పండుగకే వన్నె తెస్తాయి. మేము వీటినే ఉపయోగిస్తాం.

– కె.రమాదేవి, కోనరావుపేట

బంతిపూలు సాగు చేయండి



బంతి, చామంతి, లిల్లీ, గైలార్డియాపూల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. తక్కువ పెట్టుబడి, శ్రమలేని బంతిపూలు సాగు చేయాలి.

– మహేశ్, హార్టికల్చర్ ఆఫీసర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- మనస్తాపంతో భర్త ఆత్మహత్యాయత్నం



శ్రీదేవి(ఫైల్)

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని లెక్చరర్‌కాలనీలో నివాసం ఉండే దిడ్డి శ్రీదేవి(53) అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. మనస్తాపంతో భర్త దిడ్డి సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. టౌన్ సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. దిడ్డి శ్రీదేవి – దిడ్డి సుధాకర్‌కు కొన్నేళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఆదర్శ్, కూతురు సింధూ ఉన్నారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, 'మీ అక్క చనిపోయి ఉంద'ని సుధాకర్ ఫోన్‌ద్వారా ఆమె సోదరుడు పోరండ్ల శ్రావణ్‌కు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. ఆ వెంటనే కుటుంబసభ్యులతో కలిసి అక్కడకు చేరుకున్న శ్రావణ్.. సోఫాలో పడుకొని మృతి చెందిన తన అక్కను చూసి రోదించాడు. తన కూతురుకు అనారోగ్యం లేదని, బాధపడేంత ఇతర కారణాలు కూడా ఏమీలేవని, ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి తల్లి తిరుపతమ్మ



చికిత్స పొందుతున్న దిడ్డి సుధాకర్

వాపోయింది. మృతిపై విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదుచేశారు.

భర్త సుధాకర్ ఆత్మహత్యాయత్నం..

శ్రీదేవి చనిపోవడంతో మనస్తాపం చెందిన సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తన భార్య శ్రీదేవి సోఫాలో పడుకుని గుండెపోటుతో మృతి చెందిందని, ఆమె మృతిని తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించానని సుధాకర్ వెల్లడించాడు. మరోవైపు.. తన తల్లి మృతి చెందిందనే సమాచారంతో అమెరికాలో ఉంటున్న కుమారుడు ఆదర్శ్ వెంటనే ఇండియా బయలుదేరినట్లు బంధువులు తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఏడుగురికి జైలు

మంథని: ముత్తారం మండలం ఖమ్మంపల్లి, పోతారం, మైదంబండ, అడవిశ్రీరాంపూర్, కేశనపల్లి, పారుపల్లి గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తూ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఏడుగురిని బుధవారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. దీంతో వారికి ఏడాది జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించారన్నారు. ఈమేరకు నిందితులను రిమాండ్ నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్, సిబ్బంది శ్రీనివాస్, మహేందర్, నిరంజన్, వసంత, రవి పాల్గొన్నారు.

మూడిళ్లలో చోరీ



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని అయ్యప్ప ఆలయ సమీపంలోని హరిహర కాలనీలో బుధవారం వేకువజామున తాళం వేసి ఉన్న మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇళ్ల తాళాలు పగులగొట్టి తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. ఉదయం పక్కింటి వారు లేచేసరికి డోర్లు తెరిచి ఉండటంతో ఇంటి యజమానులకు సమాచారం అందించారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించగా పట్టణ సీఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకుని హరిహర కాలనీలో సీసీపుటేజీలను పరిశీలించారు. ముగ్గురు దొంగలు ముసుగులు వేసుకుని వెళ్లినట్లు రికార్డు అయింది. సీఐ మాట్లాడుతూ.. ఇళ్లలో విలువైన వస్తువులు ఉంచవద్దని, బ్యాంక్ లాకర్లలోగానీ భద్రపర్చుకోవాలన్నారు. ప్రతి కాలనీల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

బైక్ అదుపు తప్పి మామ, కోడలు దుర్మరణం

- స్వల్పగాయాలతో బయటపడిన మృతురాలి భర్త
- పెళ్లైన 10 నెలలకే విషాదం
- మృతురాలిది ఇబ్రహీంపట్నం మండలం కొజన్‌కొత్తూర్



పూజ (ఫైల్)



నారాయణ (ఫైల్)


మాక్లూర్/నందిపేట్ (ఆర్మూర్): బైక్ అదుపు తప్పిన ఘటనలో మామ, కోడలు మృతి చెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం దుర్గానగర్ శివారులో బుధవారం వేకువజామున చోటు చేసుకుంది. నందిపేట మండలం తల్వేదకు చెందిన చింటుకు ఇబ్రహీంపట్నం మండలం కొజన్ కొత్తూర్‌కు చెందిన పూజ (25)తో పది నెలల క్రితమే వివాహమైంది. బీటెక్ చదివిన పూజ పెళ్లికి ముందు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేది. పెళ్లి సమయంలో ఉద్యోగం మానేసిన ఆమె.. మళ్లీ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఇంటర్వ్యూ కోసమని హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది. బైక్‌పై తమను నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద వదిలేసి రావాలని చింటు తండ్రి నారాయణ (58)ను కోరాడు. ముగ్గురూ కలిసి బైక్‌పై బయల్దేరారు. చింటు డ్రైవింగ్ చేస్తున్నారు. దుర్గానగర్ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. నారాయణ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తీవ్రంగా గాయపడిన పూజ, చింటును అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పూజ మృతి చెందింది. మామ, కోడలు మృతితో తల్వేదలో విషాదం అలుముకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి జరిమానా

మల్లాపూర్: వ్యక్తిపై దాడి చేసిన కేసులో మండలంలోని రేగుంటకు చెందిన నిమ్మల భూమారెడ్డి, ఆయన అల్లుడు ఏనుగు శేఖర్‌కు మెట్‌పల్లి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.అరుణ్‌కుమార్ రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. బాధితుడు ఉత్కం రాజాగౌడ్‌కు రూ.8వేల పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు. భూమారెడ్డి, శేఖర్ 2020 ఆగస్టు 9న అదే గ్రామానికి చెందిన రాజాగౌడ్ భూమిని కబ్జా చేసేందుకు యత్నించారు. రాజాగౌడ్ అడ్డుకోబోగా దుర్భషలాడుతూ కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ రాజాగౌడ్‌ను భార్య అండాలు, కుమారుడు భూమేశ్వర్ మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. దాడి ఘటనపై భూమేశ్వర్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై గోపతి రవీందర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం జడ్జి నిందితులకు జరిమానా విధించారు.

తల్లిని పట్టించుకోని కొడుకులకు కౌన్సిలింగ్

హుజూరాబాద్‌రూరల్: కొడుకులు పట్టించుకోవడం లేదంటూ మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన ములుగు రాజమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆర్డీవో రమేశ్‌బాబు గ్రామంలో విచారణ చేపట్టారు. ఒక్కొక్కరూ నెలకు రూ.మూడువేల చొప్పున తల్లి పోషణ నిమిత్తం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు సరిగా అమలవుతున్నాయో లేదా అని తెలుసుకోవడానికి కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలోని బృందం బుధవారం విచారణ చేపట్టింది. విచారణలో రాజమ్మను కుమారులు పట్టించుకోవడం లేదని తేలింది. ఆమె ముగ్గురు కొడుకులకు కౌన్సిలింగ్ ఇచ్చి రాజమ్మను పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణలో



గ్రామంలో కుమారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

సోషల్ కౌన్సిలర్ పద్మావతి, డీవీసీ కౌన్సిలర్ ఆరె శేఖర్, ఎస్‌ఆర్వో రఫీ, హెడ్ కానిస్టేబుల్ మధు, మల్లయ్య, మద్రి శ్రీనివాస్ తదితరులున్నారు.

కుందనపల్లి రైల్వే వంతెనకు గ్రీన్‌సిగ్నల్

రామగుండం: పెద్దపల్లి జంక్షన్ – రామగుండం మధ్య గల కుందనపల్లి రైల్వేగేట్ (ఎల్‌సీ49) వద్ద వంతెన నిర్మాణానికి రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. వంతెన నిర్మాణానికి రూ.110 కోట్లు వెచ్చిస్తారని, రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తిచేస్తారన్నారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ బుధవారం స్థానిక రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. రామగుండంలో మరిన్ని కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ యోచనలో ఉన్నామన్నారు. పెద్దంపేట రైల్వేగేట్ వద్ద వంతెన నిర్మాణం ప్రతిపాదనలో ఉందన్నారు. కాగా, అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు కార్మికుల సమస్య పరిష్కరించాలని బర్మా, కాందీశీకుల సంఘం ప్రతినిధి ఇండిబిల్లి రవీందర్, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని మసీదు కమిటీ, ఇతర సమస్యలపై రైల్వే బోర్డు సభ్యుడు అనుమాస శ్రీనివాస్ తదితరులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఇటీవల గోదావరిలో గల్లంతైన అక్బర్‌నగర్‌లోని నారకట్ల రాజేశ్ కుటుంబసభ్యులను ఎంపీ పరామర్శించారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్ల రద్దు

రామగుండం: రామగుండం–మందమర్రి మధ్య 24 కిలో మీటర్ల పరిధిలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్(ఏబీఎస్) వ్యవస్థను మూడు ప్రధాన రైల్వే లైన్లతో నాన్ ఇంటర్ లాకింగ్ అనుసంధాన పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈనెల 18, 19వ తేదీల్లో పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఏబీఎస్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తర్వాత రైళ్ల ఆలస్యాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని వారు తెలిపారు. ఇందులో భాగంగానే సాంకేతిక పనులకు అంతరాయం కలుగకుండా కొన్ని ప్యాసింజర్ రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆలస్యంగా నడిపిస్తున్నామని వివరించారు.

రద్దు చేసినవి

- కాజీపేట – బల్లార్షా : రామగిరి మెమూ (నంబరు 17003/04)
- కాజీపేట-బల్లార్షా : బల్లార్షా ఎక్స్‌ప్రెస్ (17035/36)
- సికింద్రాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ : భాగ్యనగర్ ప్యాసింజర్(17233/34)
- భద్రాచలం రోడ్డు – బల్లార్షా : సింగరేణి ప్యాసింజర్(17033/34)
- హైదరాబాద్-సిర్పూర్‌కాగజ్‌నగర్ : ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్(17011/12)

ఎస్జీఎఫ్ పోటీలకెళ్తున్నారా...? ఇవి మర్చిపోకండి

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలలు, కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండలస్థాయి పోటీలు పూర్తి చేసుకొని జిల్లాస్థాయికి సన్నద్ధమవుతున్నారు. అండర్ 14, 17 విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగనున్నాయి. పోటీలకు ఏఏ పత్రాలు తీసుకెళ్లాలో ఒక్కసారి చూద్దాం..

➡ జిల్లాస్థాయి పోటీలకు మండల ఎస్జీఎఫ్ కార్యదర్శి, మండల విద్యాధికారి సంతకం చేసిన మండల క్రీడా జట్టు ఎంట్రీఫాం, ప్రతీ క్రీడాకారుడు ఒక ఎస్జీఎఫ్ ఎలిజిబిలిటీ ఫామ్ (ఫొటోపైన ప్రధానోపాధ్యాయుల సంతకం ఉండాలి) పేరెంట్స్, సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయుల సంతకం, ఆధార్ కార్డు జిరాక్స్, బోనోఫైడ్ సర్టిఫికెట్ ఒరిజినల్ తీసుకెళ్లాలి. అండర్–17 క్రీడాకారులు అండర్–19 ఎస్జీఎఫ్ కార్యదర్శి మధు జాన్సన్ సంతకంతో కూడిన ఎలిజిబులిటీ ఫాం తీసుకెళ్లాలి. 10వ తరగతి మెమో జిరాక్స్‌పై గెజిటెడ్ సంతకం, ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లాలి.

➡ ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేవారు జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి సంతకం చేసిన జిల్లా ఎంట్రీ ఫాం. ఎస్జీఎఫ్ ఎలిజిబులిటీ ఫాం(ఫొటోపై సంబంధిత ప్రధానోపాధ్యాయుల సంతకం) పేరెంట్స్, వ్యాయామ ఉపాధ్యాయుల సంతకం, ఆధార్ కార్డు జిరాక్స్, బోనోఫైడ్ సర్టిఫికెట్ ఒరిజినల్ తీసుకెళ్లాలి. అండర్–17 క్రీడాకారులు ఎస్జీఎఫ్ కార్యదర్శి మధు జాన్సన్ సంతకంతో కూడిన ఎలిజిబులిటీ ఫాం తీసుకెళ్లాలి. 10వ తరగతి మెమో జిరాక్స్‌పై గెజిటెడ్ సంతకం, ఆధార్ కార్డు తప్పనిసరి.

➡ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి సంతకం చేసిన నాలుగు ఎలిజిబులిటీ ఫామ్స్, బర్త్ సర్టిఫికెట్, బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకెళ్లాలి. అండర్– 17 క్రీడాకారులు కార్యదర్శి సంతకం చేసిన నాలుగు ఎలిజిబులిటీ ఫామ్స్, 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్ (మెమో వెనకాల సంబంధిత కళాశాల అడ్మిషన్ స్టాంపు ఉండాలి.) బోనోఫైడ్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి.

కలెక్టర్ రాకపై వివాదం

సిరిసిల్ల: ప్రజాపరిపాలన దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజన్నసిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా రాకపై వివాదం చెలరేగింది. ప్రజాపరిపాలన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తొలుత చేరుకున్నారు. అనంతరం ఎస్పీ మహేశ్, అదనపు కలెక్టర్ నగేశ్ సమక్షంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. జాతీయ గీతం ముగింపు దశలో వేదికపైకి వచ్చిన కలెక్టర్‌ను ఉద్దేశించి విప్ ఆది శ్రీనివాస్ ఆలస్యంగా వచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే దీనిపై కలెక్టరేట్ వర్గాలను సంప్రదించగా కలెక్టర్ సమయానికే చేరుకున్నారని.. నిర్ణీత సమయం కంటే నాలుగు నిమిషాలు ముందు విప్ ఆది శ్రీనివాస్ రావడం అపార్థాలకు దారి తీసిందని వెల్లడించాయి.

పలుకుబడికే ప్రాధాన్యం

- జిల్లాలో మూడింటికే పర్సన్ ఇన్‌చార్జీలు
- 27 సంఘాలకు పాత పాలక వర్గాల గడువు పొడిగింపు
- అక్రమాలు వెలుగుచూసినా..అంతేనా?

కరీంనగర్ అర్బన్: సహకార సంఘాల పదవీకాలం పొడిగించారు. ఆరోపణలున్నా సంఘాలను కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. మొత్తంగా రాజకీయ పలుకుబడికి ప్రాధ్యాతనిచ్చారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పలు సహకార సంఘాల్లో అక్రమాలు వెలుగుచూసిన విషయం తెలిసిందే. లక్షలకు లక్షలు స్వాహా చేయగా సదరు పాలకవర్గ గడువు పొడిగించడంతో నిజాయితీగా నిలిచిన సంఘాలు విస్తుపోతున్నాయి. గత అయిదేళ్లలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తుండగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ నామమాత్రమే. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) 30 ఉండగా గత ఫిబ్రవరి 14తో పాలకవర్గాల గడువు ముగియగా మరో 6నెలలు పొడిగించగా సదరు గడువు గత నెల 14తో ముగిసిన విషయం విదితమే. ఈ క్రమంలో మరో 6 నెలలు పాలకవర్గాల గడువు పొడిగిస్తూ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పాలకవర్గాల పనితీరు మెరుగ్గా ఉన్న సంఘాలకే వర్తిస్తుందని స్పష్టం చేశారు.

27 సంఘాలకు పొడిగింపు

ఆడిట్ అభ్యంతరాలు, అక్రమాలు, నిధుల దుర్వినియోగం వంటి ఫిర్యాదులుంటే పెండింగ్‌లో పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ జిల్లాలో 30 సంఘాలుంటే 27 సంఘాల పాలకవర్గాల గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేవలం మూడు సంఘాలకే ప్రత్యేక అధికారుల పాలనను విధించింది. మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి, ఊటూరు, చొప్పదండి మండలంలోని అర్నకొండ సొసైటీకి ప్రత్యేక అధికారులను నియమించింది. అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఊటూరు ప్యాక్స్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా శివనాగేందర్‌రెడ్డి, గట్టుదుద్దెనపల్లికి శైలజ, అర్నకొండ ప్యాక్స్ పర్సన్ ఇన్‌చార్జిగా జమునారాణిని నియమించారు.

కట్నం కేసు నమోదు

కరీంనగర్‌క్రైం: అదనపు కట్నం తేవాలంటూ వేధించిన అత్తింటివారిపై నగరంలోని మహిళా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలి వివరాల ప్రకారం నగరానికి చెందిన మౌనికకు సూర్యతేజతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో కోరినంత కట్న, కానుకలు ఇచ్చారు. ఏడాదిగా సూర్యతేజతో పాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నారు. మౌనిక మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

పెగడపల్లి తహసీల్దార్ సస్పెండ్

జగిత్యాలక్రైం: పెగడపల్లి తహసీల్దార్ రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రవీందర్ ఇటీవల మహిళా ప్రభుత్వ ఉద్యోగిని లైంగికంగా వేధించగా పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జైలులో ఉన్న రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

డిజిటల్ క్రాప్ సర్వే షురూ

- గతానికి భిన్నంగా వెనులుబాటు
- అక్టోబర్ 20 గడువు

కరీంనగర్ అర్బన్: డిజిటల్ క్రాప్ సర్వే క్రమంగా పట్టాలెక్కుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం సర్వే చేపడుతున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్లో కొంత ఆలస్యంగా మొదలవగా సర్వే పురోగతిని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సమీక్షిస్తున్నారు. వచ్చే అక్టోబరు 20నాటికి పూర్తి చేయాల్సి ఉండగా గతేడాది సర్వే నిర్వహణకు ఏఈవోలు చేతులెత్తేయగా ఈ ఏడాది ఆ సమస్య తలెత్తకుండా, సజావుగా సాగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

17 అంశాలతో వివరాల నమోదు

మార్కెటింగ్, ఎరువులు, విత్తనాలు, దిగుమతులు, ఎగుమతులు, ప్రాసెసింగ్ వంటి అవసరాల ప్రణాళికను రూపొందించేందుకు ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. 17 పేజీల మార్గదర్శకాలతో ప్రభుత్వం ఆదేశించింది. పచ్చిరొట్ట, అపరాలు, సీడ్ ప్రొడక్షన్ వివరాలు, అంతర పంట వివరాలు, సేంద్రియ వ్యవసాయం చేసే వారి వివరాలు, ప్రతి పంట వాటి రకాలు, నీటి వసతి, ఉద్యాన పంటలైతే వయసు, చెట్ల సంఖ్య నమోదు చేయనున్నారు. గత నెల వరకు 2,10,234 పాసుపుస్తకాలకు డిజిటల్ సైన్ కాగా ప్రతి సర్వే నంబర్ వారీగా పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. వివరాల నమోదు అనంతరం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచిన అనంతరం రైతుల ఫోన్ నంబర్లకు ఎస్సెమ్మెస్ రానుంది.

పురుషులకు 2 వేలు.. మహిళలకు 18,00 లక్ష్యం

సీజన్లో ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ క్లస్టర్ పరిధిలోని రైతులను ప్రత్యక్షంగా కలిసి వాస్తవంగా సాగులో ఉన్న క్షేత్రాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేయాలి. మహిళా ఏఈఓలు కనీసం 1,800 ఎకరాల్లో, పురుష ఏఈఓలు కనీసం 2వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించాలని



ప్రభుత్వం ఆదేశించింది. మిగిలిన వాటికి సాధారణ క్రాప్ బుకింగ్ పద్ధతిలో చేస్తారు. ప్రతి పంటను ఫొటో తీసి అప్లోడ్ చేయటం తప్పనిసరి. నమోదు మొత్తాన్ని ఒకే మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేస్తారు. సర్వేలో వరి రకాల వివరాలు పేర్కొనటం తప్పనిసరి. ధాన్యం సేకరణ కోసం ఇది ఉపయోగపడుతుంది.

సర్వే ఎందుకంటే

దేశంలో ఏ పంట దిగుబడి ఎంత వస్తుందనే అంచనా సులువు. అలాగే దిగుబడులకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధరల నిర్ణయం ఉండనుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కచ్చితత్వంతో నష్ట నిర్ధారణ ఉంటుంది. అలాగే చీడపీడల ఉనికి, తగిన విధంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు సంసిద్ధతకు వినియోగించనున్నారు. వ్యవసాయ పురోగతి అంచనాకు ఈ సర్వే దోహదపడుతుంది.

జిల్లాలో మొత్తం రైతులు	: 2,10,234
మొత్తం క్లస్టర్లు	: 77
రెవెన్యూ గ్రామాలు	: 205
భూ విస్తీర్ణం	: 3,33,450 ఎకరాలు

రైతుకు సంక్షిప్త సందేశం

క్రాప్ బుకింగ్ 90శాతం పూర్తి కాగానే రైతులకు సంక్షిప్త సమాచారం ద్వారా వివరాలు పంపిస్తారు. రైతు వివరాలు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రదర్శించాలి. నమోదులో తప్పులు దొర్లితే సరిచేయమంటూ రైతు దరఖాస్తు ఇవ్వాలి. ఏఈవో మూడు రోజుల్లో సరి చేసి తుది జాబితా ప్రదర్శించనున్నారు. జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే ముమ్మరంగా సాగుతోందని, తప్పుగా నమోదైన వివరాలు సరిచేసేందుకు అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి వివరించారు.